# రాజీ

-సాధనాల నాగవర్ధని






బయల్దేరుతూ పెద్దగా కూతవేసిన ట్రెయిన్‌తో పాటు తనూ నిట్టూర్చింది వనాలు. మొండిగా వచ్చేసిందిగానీ అది మంచి పనేనా అని ఆలోచిస్తూ ఉండిపోయింది. ఏమిటో ఈవాళ ఇలా జరిగింది అనుకుంటూ దిగులుగా కిటికీలోంచి బయటకు చూస్తుండిపోయింది. అంతకు నెలరోజుల క్రితం కూడా తనిలాగే పుట్టింటికి వెళ్లిన సంగతి ఆ నిముషంలో గుర్తులేదామెకు.

వనాలు పూర్తి పేరు వనములమ్మ. కాలేజీలో కూడా ఎవరూ వెక్కిరించలేదు. దేవత పేరని అందరూ వనాలూ అనే పిలిచేవారు. బామ్మ పేరని ఇంట్లోనూ మురిపెమే. బామ్మయితే మరీనూ. వనాలు తల్లీ అంటుంది గారంగా. అదేమిటో మరి! ఆయనకే తన పేరు నచ్చలేదు.

"వనములమ్మా ఏమిటీ పాడు? పెళ్ళయ్యాక నాకిష్టమొచ్చిన పేరుతో పిల్చుకోవచ్చనుకున్నాను. మాట్లాడితే అమ్మో దేవత పేరు అంటావు. అది కాకపోతే బామ్మ వూరుకోదు అంటావు. నా ఫ్రెండ్సెవరయినా వస్తే ఏమని చెప్పను? వనాలూ, తోటలూ అని" అంటూ చిందులు తొక్కుతారు. తన పేరు మాధవ్ కనుక ఏ మాలతి అనో పేరు మార్చుకోమంటారు.

ఈ రోజూ అదే గొడవ. సాయంకాలం తన బెస్ట్ ఫ్రెండ్ ఒకరు వస్తారట. తమ పెళ్లికి రాలేదుట అతను. అతనికి పరిచయం చేసేటప్పుడు జ్యోత్స్న అని చెప్తారట తన పేరు. తనేం మాట్లాడకూడదుట. ఏం? ఎందుకు మాట్లాడకూడదు? ముచ్చటగా తన పేరుతో పరిచయం చేయలేక పోతే.. అని కాసేపు అక్కసుగా వాదన వేసుకుంది తను. అదేం విననట్లుగా చేయవలసిన ఏర్పాట్ల గురించి చెప్పి 'నీ పేరు జ్యోత్స్న మర్చిపోకు' అంటూ ఆఫీసుకు వెళ్లిపోతారా? పెళ్లయిన ఈ మూడునెలలనుంచీ ఇదే గొడవగా వుంది. పరస్పరం ఎంత ప్రేమున్నా ఈ పేరు దగ్గరే ఇద్దరికీ పడకుండా ఉంది. ఒళ్ళు మండింది వనాలుకి.

గబగబా సూటుకేసు సర్దుకుని రైలెక్కింది వనాలు. ఎలాగూ తనని తీసుకువెళ్లడానికి తన వూరు వస్తారుగా! అప్పుడు నాన్నతోనూ, బామ్మతోనూ గట్టిగా డోస్ ఇప్పించాలి ఆయనకి అని కూడా అనుకుంది.

• • •

సాయంకాలం ఓ గంట పర్మిషన్ పెట్టి ఫ్రెండ్ రూమ్‌కి వెళ్తే అతను అర్జంటుగా క్యాంప్ వెళ్లవలసి వచ్చి ఏలూరు వెళ్లాడని తెలిసింది. సరే! తను పనంతా చేసుకుని రెడీగానే వుంటుందికదా! సినిమాకైనా వెళ్లొచ్చుననుకుంటూ ఇంటికి వచ్చాడు మాధవ్. ఇంటికి తాళం వేసి ఉండడంతో ఎక్కడికి వెళ్లి వుంటుందా అనుకుంటుంటే ఇంటి వాళ్ళబ్బాయి వచ్చి తాళం చెవి ఇస్తూ "అక్కయ్యగారు వాళ్ళమ్మగారింటికి వెళ్లారండీ" అని చెప్పాడు.

"డామిట్! వాడు క్యాంప్‌కెళ్లబట్టి సరిపోయింది గానీ వాడ్ని వెంటబెట్టుకుని వచ్చినా ఇలాగే చేసేదా ఈ పెంకిపిల్ల?" అని విసుక్కుని స్నానం చేసి కాస్సేపలా తిరిగి వద్దామని బయల్దేరాడు.

ఓ నెల క్రిందట ఇలాగే "నీ పేరు నాకు నచ్చలేదు. శాంతి అని పిలుస్తాను" అన్నందుకు కోపం తెచ్చుకుని పుట్టింటికి వెళ్లింది వనాలు. రెండ్రోజులు చూసి లాభం లేదని మూడోరోజు తనే వెళ్లి తీసుకొచ్చాడు. ఇదిగో! మళ్ళీ మొదలు. ఆలోచిస్తూ పార్కులో కూర్చున్నాడు.

అక్కడ పిల్లలు ఆడుకుంటున్నారు. అందులో ఓ పదేళ్ళ పాప మరో అమ్మాయిని పిలుస్తోంది. 'వనజా! ఏయ్ వనీ!' అంటూ.

మాధవ్ బుర్రలో ఓ ఫ్లాష్! అవును. తనూ వనాల్ని 'వనీ' అని ఎందుకు పిలువకూడదు? అలాగైతే ఆమెకు కూడా అభ్యంతరం ఉండకపోవచ్చు. తన పేరుని మార్చడంలేదుకదా! ఇది బావుంది.

రేపు ప్రొద్దుటే వెళ్లి తనని తీసుకువచ్చేయాలి. ఈ పేరు గురించేగానీ తమ మధ్య ఏ పొరపొచ్చాలు లేవుగదా! వనాలు...వనీ...బాగానే వుంది. ఇక తను అలిగి వెళ్లడం జరగదులే. ఏదో ఒక విధంగా రాజీ పడాలికదా. హుషారుగా ఈల వేసుకుంటూ ఇంటికి బయల్దేరాడు మాధవ్.

★